సాక్షి సూర్యాపేట

ఆదివారం । 18 । ఆగస్టు । 2024



సంస్కృతిని పరిరక్షించుకోవాలి

సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

- 10లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 590 అడుగులు
ఇన్‌ఫ్లో	: 69,884 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 69,884 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,191 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,375 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 7,518 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 1800 క్యూసెక్కులు
వరద కాల్వకు	: 600 క్యూసెక్కులు

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం:	642.38 అడుగులు
ఇన్‌ఫ్లో	: 768 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	: 623.43 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 258.88 క్యూసెక్కులు
కుడికాల్వకు	: 305.95 క్యూసెక్కులు
సీపేజీ, లీకేజీ ద్వారా	: 11.15 క్యూసెక్కులు

న్యూస్‌రీల్

బీఎల్‌ఓలకు శిక్షణ ఇవ్వాలి



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్, అదనపు కలెక్టర్

భానుపురి(సూర్యాపేట): ఓటరు నమోదు, సవరణలపై బీఎల్‌ఓలకు మండలాల వారీగా శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి అదనపు చీఫ్ ఎలెక్షన్ ఆఫీసర్ (సీఈఓ) లోకేష్ కుమార్‌తో కలిసి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ బీఎస్ లతతో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు ఖాళీగా ఉండకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు వేణుమాధవ్, సూర్యనారాయణ, శ్రీనివాస్, ఎలక్షన్ పర్యవేక్షకులు శ్రీనివాస్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నతస్థాయికి ఎదగాలి : ఎస్పీ



ఎస్పీకి రాఖీ కడుతున్న విద్యార్థిని

సూర్యాపేట టౌన్: బాలికలు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అన్నారు. బేటీ బచావో–బేటీ పడావో అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో సూర్యాపేటలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో విద్యార్థినులతో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు ప్రణాళికతో చదివి తల్లిదండ్రుల కళను సాకారం చేయాలన్నారు. బాల బాలికల రక్షణలో జిల్లా సంక్షేమ, శిశు సంక్షేమ శాఖ అధికారులు కృషి చేయాలని కోరారు. భాలికలతో మొక్కలు నాటిన అనంతరం విద్యార్థినులు ఎస్పీ, పోలీస్ సిబ్బందికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్‌డ్ అదనపు ఎస్పీ జానార్దన్‌రెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు, ఆర్ఐ నారాయణ రాజు, చైల్డ్ వెల్ఫేర్ అధికారి కిరణ్మయి, కోఆర్డినేటర్ చైతన్య, రేవతి, వినోద్, తేజస్విని, జెడ్పీ విద్యార్థినులు పాల్గొన్నారు.

రాష్ట్ర కన్వీనర్‌గా శ్రీకాంత్‌గౌడ్



మొల్కపురి శ్రీకాంత్‌గౌడ్

నాగారం: బహుజన విప్లవ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాల కమిటీ రాష్ట్ర కన్వీనర్‌గా నాగారం మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్‌గౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించిన బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి, తాడి కార్పొరేషన్ చైర్మన్ బుర్ర వెంకటేశంకు ప్రత్యేక కృతజ్ఞలు తెలిపారు. పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

నిందితులను వదలొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సృజన

హుజూర్‌నగర్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని, ఎవరినీ వదలొద్దని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన డిమాండ్ చేశారు. శనివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సమాఖ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల కోల్‌కతాలోని ఆర్‌జీ.కార్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో పీజీ రెండో సంవత్సరం చదువుతున్న వైద్య విద్యార్థిని హత్య అమానుష చర్య అన్నారు. దేశంలో మహిళలు, చిన్నారులపై రోజురోజుకు అఘాయిత్యాలు పెరుగుతున్నా కేంద్ర, ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరి, నాయకురాళ్లు పశ్య పిచ్చమ్మ, దేవరం సుజాత తదితరులు పాల్గొన్నారు.

• తీజ్ సంబురం



సూర్యాపేట మండలం దాస్‌తండాలో శనివారం సాయంత్రం నిర్వహించిన తీజ్ వేడుకల్లో పాల్గొన్న గిరిజన యువతులు, చిన్నారులు

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికకు దరఖాస్తులు

సూర్యాపేట టౌన్: సెప్టెంబర్ 5వ తేదీ గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక నిమిత్తం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఈ నెల 25వ తేదీలోగా ఆయా మండలాల పరిధిలోని ఎంఈఓలకు నిర్దీత నమూనాలో దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ కె.అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గెజిటెడ్ హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీలు కేటగిరీ వారీగా మండల విద్యా శాఖ అధికారులకు దరఖాస్తు ప్రతిపాదనలు పంపించాలని పేర్కొన్నారు. కేటగిరీలకు సంబంధించిన ప్రతి కేటగిరి నుంచి ఒక ప్రతిపాదన మాత్రమే జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

అర్ధాకలి చదువులు!

- జూనియర్ కళాశాలల్లో కలగా మధ్యాహ్న భోజనం
- గతేడాది మంత్రివర్గం ఆమోదించినా అమలుకాని పథకం
- గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తప్పని తిప్పలు
- ఈ ఏడాదైనా పథకాన్ని అమలు చేయాలని వేడుకోలు



సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్టడీ అవర్‌లో కూర్చున్న విద్యార్థులు(ఫైల్)

ప్రభుత్వ కళాశాలలు 07	ఫస్టియర్ విద్యార్థులు 1,242
సెకండియర్ విద్యార్థులు 1,242	మొత్తం 2,613

సూర్యాపేట టౌన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు అర్ధాకలితో చదువులు కొనసాగిస్తున్నారు. విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పిస్తూ మెరుగైన విద్యనందించాలని ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెడుతున్నాది. ప్రభుత్వ కళాశాలల్లో మాత్రం మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం లేదు. దీంతో కళాశాలలకు వచ్చే అధిక శాతం గ్రామీణ ప్రాంత విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలకు సరైన సమయంలో బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం తీసుకోకుండా కళాశాలలకు వస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో కూడా ఆమోదం తెలిపారు. కానీ ప్రభుత్వం మారడంతో భోజన పథకం అమలుకు నోచుకోలేదు. ఈ నేపథ్యంలో కొత్త ప్రభుత్వంపై విద్యార్థులు ఆశలు పెట్టుకున్నారు.

జిల్లాలో ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు..

జిల్లాలో ఏడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో మొదటి, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 2,613 మంది చదువుతున్నారు. వీరంతా సగానికి పైగా గ్రామీణ ప్రాంతాల నుంచి కళాశాలలకు వచ్చి వెళ్తున్నారు. వీరు ఉదయం 9గంటల వరకు కళాశాలలకు రావాల్సి ఉండడంతో మధ్యాహ్న భోజనం తెచ్చుకోకుండా వస్తున్నారు. మరికొందరు ఉదయం కూడా తినకుండా వచ్చేస్తున్నారు. దీంతో వారు సాయంత్రం వరకు కళాశాలల్లోనే ఉండాల్సి రావడంతో మధ్యాహ్నం భోజనం ఏలక అర్ధాకలితోనే చదువుతున్నారు. అదేవిధంగా కొంతమంది విద్యార్థులు సరైన సమయంలో భోజనం తీసుకోక తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు.

మధ్యాహ్న భోజనం అందిస్తే మెరుగైన ఫలితాలు

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తే విద్యార్థుల హాజరు పెరిగే అవకాశం ఉంటుంది. దీంతో పాటు మెరుగైన ఫలితాల సాధనకు వీలుంటుంది. పౌష్టికాహారం అందడంతో విద్యార్థులు చదువుపై దృష్టి సారిస్తారని పలువురు అంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సత్వరమే మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తూ పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేలా ప్రోత్సహించాలని కోరుతున్నారు.

ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. గ్రామాల నుంచి సమీప పట్టణాలకు వచ్చి ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం ద్వారా ఫలితాలు మెరుగవుతాయి. మధ్యాహ్న భోజన పథకంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే అందుకు అనుగుణంగా అమలు చేస్తాం.

– భానునాయక్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి

మధ్యాహ్న భోజనం అందించాలి



జూనియర్ కళాశాలలకు గ్రామీణ ప్రాంతాల నుంచి పేద విద్యార్థులే అధికంగా వస్తుంటారు. అలాంటి వారికి మధ్యాహ్న భోజనం అందించి ఆదుకోవాలి. భోజన పథకం అమలుకాని కారణంగా పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలి. కళాశాలల్లో నెలకొన్న అన్ని రకాల సమస్యలనూ పరిష్కరించాలి.

– ఆవుల నాగరాజు, పీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు

రుణమాఫీపై ఆందోళన వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్, కోదాడ ఎమ్మెల్యే

• మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

కోదాడ: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తిస్తుందని, అర్హత ఉండి రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కోదాడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రుణమాఫీపై రైతుల సందేహాల నివృత్తి కోసం ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు అడిగిన పలు సందేహాలకు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్‌తో సమాధానం చెప్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రుణమాఫీ కాకపోతే ముందుగా ఏఈఓలు, ఏఓలను కలిసి ఆధార్‌కార్డ్ నంబర్ ఇచ్చి పరిశీలన చేయించుకోవాలని కోరారు. రూ.2లక్షల కన్నా ఎక్కువ రుణం ఉన్న రైతులు ఎక్కువగా ఉన్న రుణం కడితే మిగిలిన రూ.2 లక్షలను ప్రభుత్వం బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు. కొంతమంది రైతుల ఆధార్ నంబర్ తప్పుగా నమోదైందని, ఆధార్ కార్డు పేరుకు, పాస్‌బుక్ పేరు సరిపోలక రుణమాఫీ కాలేదని ఇలాంటివారు ఏఈఓలను కలవాలన్నారు. రేషన్‌కార్డు లేని వారు వ్యవసాయ అధికారులను కలిస్తే ఇంటి వద్దకు వచ్చి విచారణ చేసి లాగిన్ ద్వారా పరిశీలించి రుణమాఫీ చేస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కోదాడ ఎమ్మెల్యే నలమాద పద్మావతిరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ



అధికారులు, పీఏసీఎస్ చైర్మన్ల సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

• డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్ : అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసిందని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో రుణమాఫీపై సొసైటీ చైర్మన్లు, ఉద్యోగులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు డీసీసీబీకి రుణమాఫీ కింద రూ.279.76 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రతి సహకార బ్యాంకులో అధికారులు, ప్రజాప్రతినిధులు రుణమాఫీ కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. స్పెషల్ డ్రైవ్ సందర్భంగా రైతులు అధికారులను కలిసి తమ బ్యాంకు ఖాతా నంబర్లను, ఆధార్ కార్డు సరి చూసుకుని రుణమాఫీ పొందాలని సూచించారు. ఉమ్మడి జిల్లాకు మరో ఐదు కొత్త సహకార బ్యాంక్ బ్రాంచిలు మంజూరయ్యాయని తెలిపారు. సమావేశంలో డీసీసీబీ వైస్ చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి, డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్లు, అధికారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్‌ను హత్య చేసిన దోషులను శిక్షించాలి



సూర్యాపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్లు, జూనియర్ డాక్టర్లు, మెడికోలు

- ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ డాంగే
- సూర్యాపేటలో నిరసన ర్యాలీ చేపట్టిన వైద్యులు, మెడికోలు



ప్లకార్డుతో నినాదం చేస్తున్న జూనియర్ డాక్టర్

సూర్యాపేట టౌన్: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడి దారుణ హత్యకు ఒడిగట్టిన దోషులను కఠినంగా శిక్షించాలని ఐఎంఏ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు ఆనంద్ డాంగే, ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్ డిమాండ్ చేశారు. మహిళా డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, మెడికల్ కళాశాల నుంచి జూనియర్ డాక్టర్‌లు, మెడికోలు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ప్రభుత్వ వైద్యుల సంఘం, తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం, జూనియర్ డాక్టర్ల ఆధ్వర్యంలో కోర్టు చౌరస్తా వద్ద మానవహారం నిర్వహించారు. అనంతరం కోర్టు చౌరస్తా మీదుగా కొత్త బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యులు పనిచేసే ఆస్పత్రుల వద్ద రక్షణ కల్పించాలన్నారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై పౌర సమాజం స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వైద్యులు డాక్టర్ ఊర రామ్మూర్తి, దండ మురళీధర్‌రెడ్డి, ప్రభుత్వ వైద్యులు గిరిధర్ నాయక్, ప్రభుత్వ వైద్య సంఘం నాయకులు, తెలంగాణ జూనియర్ డాక్టర్ల సంఘం నేతలు, జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు.



కోర్టు చౌరస్తాలో మానవహారం నిర్వహిస్తున్న డాక్టర్లు, మెడికోలు

రూ.లక్షల్లో వసూలు చేశారు!

- కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో ధరణి పేరుతో దందా
- రైతులను డిమాండ్ చేసి సిబ్బంది ద్వారా వసూలు
- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు
- లంచం తీసుకున్నారని ఆర్డీఓ విచారణలో తెలిపిన రైతులు



కోదాడ తహసీల్దార్ కార్యాలయం

కోదాడ: కోదాడ తహసీల్దార్ కార్యాలయం వసూళ్ల కేంద్రంగా మారింది. ఇరవై రోజుల క్రితం ఇక్కడ పనిచేస్తున్న ధరణి ఆపరేటర్ రైతు నుంచి లంచం డిమాండ్ చేస్తూ అడ్డంగా దొరికి పోవడంతో అతన్ని జిల్లా కలెక్టర్ ఉద్యోగం నుంచే తొలగించారు. ఇది మరవకముందే ఇదే కార్యాలయంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు వారసత్వ భూమి భాగపంపిణీ కోసం దరఖాస్తు చేసుకున్న ఓ రైతు కుటుంబం నుంచి ఏకంగా రూ.1.50 లక్షలు డిమాండ్ చేశారు. ఆ డబ్బును కిందిస్థాయి సిబ్బంది ద్వారా వసూలు చేయడం, దీన్ని బాధితులు రికార్డు చేసి సామాజిక మాధ్యమాల్లో పెట్టడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. బాధిత రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన కోదాడ ఆర్డీఓతో విచారణ చేయించారు. రెండ్రోజుల క్రితం బాధిత రైతు కుటుంబం తమను వేధించిన విషయాన్ని ఆర్డీఓ వాగ్మూలం ఇచ్చింది. ఈ నివేదిక కలెక్టర్‌కు చేరడంతో అధికారులపై వేటు తప్పదనే చర్చ సాగుతోంది.

మళ్లీ పంచనామా చేయాలని..

రైతులు ఆర్డీఓకు ఇచ్చిన వాగ్మూలంలో విస్తుపోయే విషయాలు వెలుగు చూశాయి. కోదాడ మండలం కాపుగల్లుకు చెందిన రైతు ఒకరు మరణించారు. ఆయన వారసులు వారసత్వ ఆస్తి పంపిణీ (పౌతీ) కోసం తహసీల్దార్ కార్యాలయంలో నంబర్: 2300727101 ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. దీనికోసం రూ.50 వేల చలానా ది.29–09–2023న చెల్లించారు. దీనిపై విచారించి పౌతీ అమలు చేయాల్సిందిగా అధికారులను నాటి జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించారు. ఈలోగా ఎన్నికలు రావడంతో అధికారులు బదిలీపై వెళ్లారు. ఎన్నికల అనంతరం మళ్లీ రైతు కుటుంబం అధికారులను సంప్రదించగా పౌతీ ఫైల్‌లో పంచనామా రిపోర్టు లేదని మరోసారి పంచనామా చేయాలని దీనికి రూ.60 వేలు ఇవ్వాలని మండల గిర్దావర్ డిమాండ్ చేశారు. దీంతో రూ.50 వేలకు ఒప్పుకుంది. ఆ డబ్బును వీఆర్‌ఏ కొడుకు ద్వారా గిర్దావర్‌కు ఇచ్చామని, నిర్ధారణ కూడా చేసుకున్నామని రైతు కుటుంబం ఆర్డీఓకు వాగ్మూలంలో తెలిపింది. అయినా తమ పనిచేయ లేదని, ఇదేమిటని అడగగా మీరిచ్చిన డబ్బులు తహసీల్దార్‌కు ఇచ్చానని.. నాకు మరో రూ.50 వేలు ఇవ్వాలని గిర్దావర్ ఇబ్బంది పెట్టారని రైతు కుటుంబ సభ్యులు వాంగ్మూలంలో పేర్కొన్నారు.

విచారణ జరుగుతోంది

కోదాడ తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులపై కొందరు రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో విచారణకు ఆదేశించారు. విచారణ జరుగుతుంది. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించాము. సర్వే నంబర్ 194లో సాగర్ కాలువను రిజిస్ట్రేషన్ చేసిన విషయంపై కూడా విచారణ చేసి తగుచర్యలు తీసుకుంటాం.

– సీహెచ్.సూర్యానారాయణ, ఆర్డీఓ, కోదాడ

అధికారుల లీలలు మరికొన్ని..

కోదాడ మండలం దొరకుంటలో సర్వే నంబర్ 194 నుంచి వెళ్తున్న రెడ్లకుంట మేజర్ కాలువ (సాగర్ కాలువ) కింద అధికారులు గతంలో 3.38 గుంటలు భూమి సేకరించారు. ఈ భూమి కాపుగల్లుకు చెందిన ఓ రైతు పాస్‌పుస్తకంలో పొరపాటున నమోదైంది. దీన్ని గమనించిన కొందరు వ్యక్తులు.. సదరు రైతును మభ్యపెట్టి అధికారులతో మాట్లాడుకొని ఆ భూమిని తమ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. అలాగే కోదాడ మండలం నల్లబండగూడెంలో కూడా ఇలా మూడు ఎకరాల రియల్ ఎస్టేట్ వెంచర్‌లోని రోడ్లను కోదాడ తహసీల్దార్ కార్యాలయ అధికారులు రిజిస్ట్రేషన్ చేసినట్లు సమాచారం.

క్రీమీలేయర్ విధానంతోనే సమన్యాయం

పెన్‌పహాడ్: ఎస్సీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానం అమలు చేయడం ద్వారా దళితుల్లోని పేదలందరికీ సమన్యాయం జరుగుతుందని దళిత వికాస సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్ధార్థ అన్నారు. ఈ విషయంపై అవగాహన కల్పించేందుకు సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు 40 రోజుల పాటు ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకు చేపట్టనున్న పాదయాత్ర పోస్టర్‌ను శనివారం పెన్‌పహాడ్‌లో ఆవిష్కరించి మాట్లాడారు. 70 సంవత్సరాలుగా ఎస్సీ రిజర్వేషన్లను కొన్ని కుటుంబాల వారే అనుభవిస్తున్నారని, మిగతా కుటుంబాల వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సమితి ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు బచ్చలకూరి జానయ్య, జిల్లా అధ్యక్షుడు బీఎస్.రాజు, న్యాయవాది బచ్చలకూరి గోపి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న కిన్నెర సిద్ధార్థ, నాయకులు

క్లుప్తంగా

యాదాద్రిలో ఆర్జిత సేవలు పునఃప్రారంభం



శ్రీసుదర్శన నారసింహ హోమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆర్జిత సేవలు శనివారం పునఃప్రారంభమయ్యాయి. పవిత్రోత్సవాల్లో భాగంగా ఆలయంలో ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు విశేష పర్వాలు జరిగిన నేపథ్యంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజలను అధికారులు రద్దు చేశారు. పవిత్రోత్సవాలు ముగియడంతో తిరిగి ఆలయ అధికారులు శనివారం ఉదయం పునఃప్రారంభించారు. ఈ పూజల్లో భక్తులు అధికంగా పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కాగా ఆలయంలో నిత్య కైంకర్యాలు పాంచరాత్ర ఆగమ శాస్త్రానుసారంగా అర్చకులు జరిపించారు.

బైక్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. ఒకరికి గాయాలు

మోత్కూరు: బైక్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో శనివారం జరిగింది. రామన్నపేట మండలం దుబ్బాక గ్రామానికి చెందిన భిక్షమయ్య పని నిమిత్తం బైక్‌పై మోత్కూరుకు వస్తుండగా మోత్కూరు నుంచి నల్లగొండ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ మూలమలుపు వద్ద ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భిక్షమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో నార్కట్‌పల్లిలోని కామినేని ఆస్పత్రికి తరలించారు.

బాలికపై కుక్కల దాడి

ఆత్మకూర్ (ఎస్): వీధిలో ఆడుకుంటున్న బాలికపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండలం బొప్పారం గ్రామంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. బొప్పారం గ్రామానికి చెందిన చెక్కల వీరభద్రం కుమార్తె మేఘన (11) మానసిక వికలాంగురాలు కావడంతో ఇంటి వద్దనే ఉంటోంది. శుక్రవారం సాయంత్రం ఆడుకోవడానికి పక్క బజారుకు వెళ్లగా నాలుగు కుక్కలు ఒక్కసారిగా మేఘనపై దాడి చేశాయి. బాలిక అరుపులకు చుట్టుపక్కల వారు వచ్చి కుక్కలను తరిమికొట్టారు. తీవ్రంగా గాయపడిన మేఘనను చికిత్స నిమిత్తం ఆమె తండ్రి వీరభద్రం, స్థానికులు కలిసి సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. గత ఐదు నెలలుగా గ్రామంలో ఆరుగురుపై కుక్కలు దాడి చేశాయని, కుక్కలను నివారించాలని ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శనివారం శ్రీరాజ్యలక్ష్మీ చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

‘అగ్రి షో’లో ఆధునిక యంత్రాలు

నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కాలేజీ ఆవరణలో శనివారం నిర్వహించిన అగ్రి షోలో అనేక రకాల ఆధునిక యంత్ర పరికరాలను ప్రదర్శించారు. అగ్రి షోకు హాజరైన రైతులు ఆసక్తిగా తిలకించి, వాటి గురించిన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.

– నల్లగొండ రూరల్



అగ్రి షోకు హాజరైన రైతులు, ఔత్సాహికులు

సీడ్ డ్రిల్..



పప్పు ధాన్యాల సాగుకు ఉపయోగించే సీడ్ డ్రిల్ ఎరువులతో కలిపి విత్తనాలు వేసే విధానం, వేర్వేరుగా మందులు, విత్తనాలు వేసే పద్ధతి సీడ్ డ్రిల్‌లో ఉంది. రైతుకు శ్రమ తక్కువగా ఉండి ఒకేసారి 11సార్లు (వరుసలు) విత్తనం వేయవచ్చు.

మాన్యువల్ వీడర్



చిన్న రైతులు సాగు చేస్తున్న పత్తి, మిర్చి ఇతర కూరగాయల పంటల్లో రైతులే స్వయంగా కలుపును నివారించడంతో పాటు భూసారాన్ని పెంచుకునేందుకు మాన్యువల్ వీడర్ ఉపయోగంగా ఉంది. దీని ధర 3,500.

డ్రోన్ స్ప్రే



పంటలకు రసాయన మందులు పిచికారీ చేసేందుకు ఉపయోగించే డ్రోన్ స్ప్రేలను రైతులు ఆసక్తిగా తిలకించారు. వీటి ధర రూ.2లక్షల నుంచి రూ.3.50లక్షల వరకు ఉంది. డ్రోన్‌ల ద్వారా రసాయన మందులు పిచికారీ చేస్తే నేరుగా మొక్కపైనే పడుతుంది. దీంతో రైతుకు ఆరోగ్యపరంగా రక్షణ లభించడంతో పాటు కూలీల ఖర్చు తగ్గుతుంది. పలు రకాల కంపెనీలు డ్రోన్‌లను షోలో ప్రదర్శించారు. 12 నుంచి 18 లీటర్ల వరకు సామర్థ్యం కలిగి ఉన్నాయి.

టైర్ చక్రాలు



గతంలో ఇనుప చక్రాలు, ఎడ్లబండి సాయంతో మందుల పిచికారీ చేసేవారు. పంటకు నష్టం జరగకుండా ట్రాక్టర్‌కు తక్కువ సైజ్‌లో ఉన్న టైర్ చక్రాలను బిగించి పత్తి, వేరుశనగ, వరి, పచ్చిమిర్చి తదితర వాణిజ్య, పప్పు ధాన్యాల పంటలకు మందుల పిచికారీ చేయడం సులభతరంగా ఉంటుంది. చక్రాల జత రూ.1.20లక్షలుగా ఉంది.

వరి నాటు యంత్రం

4, 6 వరుసలు ఉండే వరి నాటు యంత్రాలను ప్రదర్శనలో ఉంచారు. పెట్రోలుతో నడిచే యంత్ర పరికరం ప్రదర్శనలో ఉంచగా దీని ధర రూ.3.50లక్షల నుంచి రూ.4.20 లక్షల వరకు ఉంటుంది. 4 వరుసల యంత్రం రూ.3.50లక్షలు ఉండగా, 6 వరుసల యంత్రం రూ.4.20లక్షలుగా ఉంది. దీనికి ప్రభుత్వం రూ.50వేల సబ్సిడీ ఇస్తుంది.



భూమ్ స్ప్రే ట్యాంక్



భూమ్ స్ప్రే ట్యాంకర్‌తో వాణిజ్య పంటలకు, వరి పంటకు మందులు స్ప్రే చేయడం సులభంగా ఉంటుంది. 30 ఫీట్ల వరకు పంట సాగులో మందులు పిచికారీ చేయవచ్చు. భూమ్ స్ప్రేను తొలగించి బత్తాయి, నిమ్మ, ఇతర పంటలకు కూడా స్ప్రే చేసే విధానం ఉండటంతో రెండు రకాల ప్రయోజనాలు ఉన్నాయి. దీని ధర రూ.1.05లక్షలుగా ఉంది.

తోటలకు స్ప్రే చేసేందుకు..



మామిడి, కొబ్బరి, పామాయిల్ తోటల్లో మందులు స్ప్రే చేసేందుకు ట్రాక్టర్‌ను పోలి ఉన్న యంత్రం ప్రదర్శనలో పెట్టారు. ఎత్తయిన మొక్కలకు సులభంగా మందు స్ప్రే చేయడానికి ఇది ఉపయోగపడుతుంది. మిత్ర కంపెనీ తయారు చేసిన స్ప్రే యంత్రం 600 నుంచి 2వేల లీటర్ల సామర్థ్యం కలిగి ఉన్నాయి. దీని ధర రూ.4.50 లక్షలు ఉంటుంది.

బయో ఫ్లాక్ పద్ధతిలో చేపల పెంపకం

బయో ఫ్లాక్ పద్ధతి ద్వారా చేపల పెంపకం సులభంగా చేయవచ్చు. భూమిలో చేపల చెరువులు ఏర్పాటు చేయడం ద్వారా నీరు ఎక్కువగా ఇంకుతుంది. బయో ఫ్లాక్ పద్ధతి ద్వారా తక్కువ ప్రదేశంలో ఉన్న కొద్ది నీటితో చేపల పెంపకం సులభంగా చేయవచ్చు.



ప్యాడీ బూట్లు



రైతుల కాళ్లకు రక్షణగా ఉండే ప్యాడీ బూట్లు ప్రదర్శనలో ఉంచారు. రైతులు ఏ సమయంలోనైనా వ్యవసాయ క్షేత్రంలో ఉన్నప్పుడు విషసర్పాలు, విద్యుదాఘాతానికి గురికాకుండా ప్యాడీ బూట్లు ఉపయోగంగా ఉంటాయి. వీటి ధర 1000.

సోలార్ సీసీ కెమెరాలు





ప్రదర్శనలో సోలార్‌తో నడిచే సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వ్యవసాయ క్షేత్రాలు, నివాసంలో కూడా ఏర్పాటు చేసుకోవచ్చు. ఫోన్‌కు కనెక్ట్ చేసుకుని పర్యవేక్షణ చేసే సౌకర్యం ఉంది. చుట్టూ తిరిగే కెమెరాతో పాటు ఒక వైపే చూసే కెమెరా కూడా ఉంది. దీని ధర 14,800గా ఉంది.

‘డిండి’ పూర్తయితేనే ఫ్లోరోసిస్‌కు పరిష్కారం

- నిమ్స్ మాజీ డైరెక్టర్ రాజారెడ్డి



మర్రిగూడ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులతో మాట్లాడుతున్న నిమ్స్ మాజీ డైరెక్టర్ రాజారెడ్డి

మర్రిగూడ: డిండి ఎత్తిపోతల, శివన్నగూడ ప్రాజెక్టు త్వరగా పూర్తయితే నల్లగొండ జిల్లాలో ఫ్లోరోసిస్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని నిమ్స్ మాజీ డైరెక్టర్ డి. రాజారెడ్డి అన్నారు. శనివారం మర్రిగూడ మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌ను ఆయన సందర్శించారు. పాఠశాలలో, అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థుల దంతాలను పరిశీలించి ఫ్లోరోసిస్ ఏమైనా ఉందా అని పరిశీలించారు. అనంతరం శివన్నగూడ ప్రాజెక్టు పనులను పరిశీలించి ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ కంచుకట్ల సుభాష్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మహేశ్వరం సతీష్, గొట్టిముక్కుల ప్రకాశ్, ఉపాధ్యాయులు మాస బాలరాజు, కళా శ్రీనివాస్, కృష్ణమూర్తి, వెంకటంపేట బాలయ్య, వెలిమినేటి సత్తిరెడ్డి, సురిగి యాదయ్య, వంగూరి సంజీవయ్య, పురుషోత్తం, వెంకటేశ్వర్లు, లింగయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

హుజూర్‌నగర్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఒకరిని అరెస్ట్ చేశారు. మరో నలుగురు పరారయ్యారు. ఈ ఘటన శనివారం చింతలపాలెం మండలంలో జరిగింది. ఎస్‌ఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలం శోభనాద్రిగూడెం శివారులో గల సూరంశెట్టి చెన్నకేశవరావు కోళ్ల ఫాం వద్ద ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు కోళ్లఫాంపై దాడి చేయగా.. నలుగురు వ్యక్తులు పారిపోయారు. నగెళ్ల వెంకటేశ్వర్లు పట్టుబడ్డాడు. అతడి వద్ద నుంచి రూ.500, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పారిపోయిన వారిలో శోభనాద్రిగూడేనికి చెందిన దావనం నరసింహారావు, మేడిశెట్టి కొండయ్య, తోట నాగేశ్వరరావు, పెరికల్ల రామస్వామి ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బస్సులో బంగారు ఆభరణాలు చోరీ

మోతె: బస్సులో వెళ్తున్న ప్రయాణికులు నుంచి బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. మోతె పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లి మండలం తుంగతూర్తి గ్రామానికి పులిచింత అరుంధతి, ఆమె భర్త సత్తిరెడ్డి కలిసి మోతె మండలం విభళాపురం గ్రామంలో పెళ్లికి హాజరయ్యేందుకు శుక్రవారం సాయంత్రం సూర్యాపేట కొత్త బస్టాండ్‌లో ఖమ్మం డిపోకు చెందిన బస్సు ఎక్కారు. మామిళ్లగూడెం గ్రామం స్టేజీ వద్ద రాత్రి 7.00 గంటల సమయంలో బస్సు దిగారు. బస్సు దిగిన వెంటనే అరుంధతి తన హ్యాండ్‌బ్యాగ్‌లోని బంగారు ఆభరణాలు ఉన్న బాక్స్‌ను తెరిచి చూడగా అందులోని 6 తులాల బంగారు గాజులు, 3.5 తులాల బంగారు చేతి కంకణాలు, 5 తులాల బంగారపు చంద్రహారం, 3.5 తులాల బంగారు నల్ల పూసల గొలుసు కనిపించలేదు. బస్సులో బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లుగా భావించి మోతె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకే దత్తత

- చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ బండారు జయశ్రీ



మాట్లాడుతున్న సీడబ్ల్యూసీ చైర్మన్ జయశ్రీ

భువనగిరి: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనల మేరకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికి పిల్లలను దత్తత ఇవ్వనున్నట్లు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) చైర్మన్ బండారు జయశ్రీ తెలిపారు. శనివారం భువనగిరిలోని బాలరక్ష భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో 8 చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ ఉన్నాయని ఇందులో ఉన్న పిల్లల్లో ఇప్పటి వరకు 14 మందిని దత్తత ఇచ్చినట్లు చెప్పారు. శిశు సంరక్షణ కేంద్రాల్లో వదిలేసిన పిల్లలు, తల్లిదండ్రులు అప్పగించబడిన, బంధువుల సంరక్షణకు నోచుకుని 16 మంది పిల్లలను గుర్తించి దత్తతకు సంబంధించిన ప్రక్రియ చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పిల్లల దత్తత కోసం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన సెరా వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని లేని పక్షంలో జిల్లాలోని బాలరక్ష భవన్‌లో సంప్రదించాలని కోరారు. బాలల సంరక్షణ కేంద్రాలలో దత్తతకు అర్హులైన పిల్లలకు తగిన కౌన్సిలింగ్ నిర్వహించేందుకు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు సహకరించాలని కోరారు. అక్రమ దత్తత విషయంలో గాని దత్తత చేసే విషయంలో నిర్లక్ష్యం జరుగుతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో సభ్యులు మల్లేశం, ఇస్తారి, రుద్రమాదేవి, బాలల సంరక్షణ అధికారి సైదులు పాల్గొన్నారు.

గొర్రెల చోరీకి రెక్కీ.. ఇద్దరి అరెస్ట్

చిట్యాల: గొర్రెలు దొంగతనం చేసేందుకు వచ్చి రెక్కీ నిర్వహిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆరుగురు పరారయ్యారు. చిట్యాల ఎస్‌ఐ ఎన్. ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం రాత్రి చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులో గొర్రెల మంద నుంచి గొర్రెలను దొంగిలించేందుకు ఎనిమిది మంది యువకులు వివిధ వాహనాల్లో వచ్చి రెక్కీ నిర్వహిస్తుండగా అప్పటికే సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని ఇద్దరిని పట్టుకున్నారు. మిగతావారు పారిపోయారు. పట్టుబడిన వారిలో కేతేపల్లి మండలం బొప్పారం గ్రామానికి చెందిన గొరారపు వీరబాబు, త్రిపురారం మండలం అంజనపల్లి గ్రామానికి చెందిన నీకంటి రాజశేఖర్ ఉన్నారు. వీరిని విచారించగా గత ఏడు నెలలుగా చిట్యాల, చౌటుప్పల్, భువనగిరి, హయత్‌నగర్, ఆదిభట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో రాత్రి సమయాల్లో గొర్రెలు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి అశోక్ లేలాండ్ దోస్త్ వాహనం, టాటా ఇండికా కారు, మహేంద్ర జైలో కారు, సీబీజెడ్ బైక్, రెండు సెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనుమానాస్పదంగా తిరిగితే పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య

సూర్యాపేట టౌన్ : ఆర్థిక ఇబ్బందులతో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ ఫేస్-1కు చెందిన వసీం అత్తర్‌ఖాన్(43) జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ అవడంతో మద్యానికి బానిస అయ్యాడు. భార్య ఫజి యా బేగం కూడా జనరల్ ఆసుపత్రిలో లాబ్ టెక్నీషియన్‌గా ఉద్యోగం చేస్తోంది. శనివారం భార్య ఉద్యోగానికి, పిల్లలు స్కూల్‌కు వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేకపోవడంతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించి భార్యకు సమాచారం ఇవ్వడంతో ఆమె వచ్చే సరికి మృతిచెంది ఉన్నాడు. భార్య ఫజియా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ రాజశేఖర్ తెలిపారు.

డియర్ రజని.. నన్ను క్షమించు

వసీం అత్తర్‌ఖాన్ ఆత్మహత్య చేసుకునే ముందు సూసైడ్ నోట్ రాశాడు. డియర్ రజని (ఫజియా బేగం) నన్ను క్షమించు.. నిన్ను చాలా బాధ పెట్టాను. పిల్లలు జాగ్రత్త.. మనకు ఎవరూ లేరు.. మనిద్దరి జీవితంలో నేను చాలా ఊహలు కన్నాను. కానీ ఏదీ కుదరలేదు. వచ్చే జన్మ ఉంటే మాత్రం నా పిల్లలలో ఎవరికైనా కొడుకుగా పుడతా. అలాగే కొంతమందికి డబ్బులు ఇవ్వాలి. కింద వాళ్ల పేర్లు రాస్తున్న.. ఇవ్వకపోతే వాళ్లు తిట్టుకుంటారు.. అని లేఖలో రాశాడు. కాగా, ఫజియాబేగం అసలు పేరు రజని. రజని, వసీం మతాంతర వివాహం చేసుకున్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



గత ఎన్నికల సమయంలో పట్టుబడిన మద్యం బాటిళ్లను శనివారం సూర్యాపేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ సూపరింటెండెంట్ లక్ష్మణ్‌నాయక్ ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. అదే విధంగా 2018–20 సంవత్సరాలలో పట్టుబడిన మద్యాన్ని కూడా ధ్వంసం చేశారు.

– సూర్యాపేట రూరల్

యువకుడి అదృశ్యం



అనిల్‌కుమార్

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలం ఎల్లగిరి గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లగిరి గ్రామానికి చెందిన పోలేపల్లి అనిల్‌కుమార్(25) ఎంబీఏ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం వెతికారు. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో యువకుడి తండ్రి యాదయ్య శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యాదవరెడ్డి తెలిపారు.

రెండు గేట్ల ద్వారా సాగర్ నీటి విడుదల



రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ జలాశయం నుంచి రెండు రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం నీటి మట్టం గరిష్టస్థాయిలో 590 అడుగులుగా ఉంది. ఎగువ నుంచి సాగర్ జలాశయానికి 69,884 క్యూసెక్కుల నీరు వస్తుండగా, అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు క్రస్ట్‌గేట్ల ద్వారా 22400 క్యూసెక్కులు, ప్రధాన విద్యుత్ ఉత్పాదన కేంద్రం ద్వారా 29191 క్యూసెక్కులు మొత్తం 51591 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కుడి కాల్వ ద్వారా 8375 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7518 క్యూసెక్కులు, ఏఎమ్మార్పీ ద్వారా 1800 క్యూసెక్కులు, వరద కాల్వకు 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పులిచింతలలో 2 గేట్ల నుంచి..

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు శనివారం 45,684 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో రెండు క్రస్ట్ గేట్లను 2.5 మీటర్లు పైకి ఎత్తి స్పిల్‌వే ద్వారా 41,684 క్యూసెక్కుల నీటిని, విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 16వేల కూసెక్కులను దిగువన ప్రకాశం బ్యారేజ్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 44.69 టీఎంసీల నీరు ఉంది. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటి మట్టం 53.34 మీటర్లు కాగా ప్రస్తుతం 53.13 మీటర్ల వరకు నీరు ఉంది. ప్రాజెక్టులో 175 అడుగులకు గాను 174.30 అడుగుల వరకు నీరు ఉంది.



పులిచింతల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

105 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి..

పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో శనివారం 16 వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 105 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసినట్లు ఎస్‌ఈ దేశ్యానాయక్ తెలిపారు.